www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 15 సెప్టెంబరు 2025

5

పశ్చిమ గోదావరి

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ సిహెచ్.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చునన్నారు. అదేవిధంగా అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఎపి డాట్ జిఒ వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కూడా తెలియజేశారు.

అక్రమ చేపల చెరువులపై.. దొంగాట..!

ప్రభుత్వ భూమి ఉన్నట్లు నిర్ధారిస్తూ చేపల చెరువు వద్ద అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

'ఆ చేపల చెరువులో ప్రభుత్వ భూమి ఉందని నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ పంట బోదెకు సంబంధించి హద్దులు నిర్ణయించి రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ చెరువులో చేపలు పట్టుకునేందుకు మత్స్యశాఖ అధికారులు ఇచ్చిన గడువు సైతం ముగిసిపోయింది. చెరువు పూర్తిగా ఖాళీ అయ్యి నెలరోజులకు పైగా దాటిపోయింది. అయినప్పటికీ ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు చర్యలు మాత్రం తీసుకోకపోవడం ఏంటో అర్థం కాని పరిస్థితి.' నిడమర్రు మండలంలోని అధికారులు వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వ భూమి ఉన్నా అప్పట్లో అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేసిన మత్స్యశాఖ అనుమతులు రద్దు చేయడంలోనూ చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది.

- నిడమర్రు మండలంలోని అక్రమ చేపల చెరువుపై చర్యలు శూన్యం
- ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారుల నిర్ధారణ
- చెరువు ఖాళీ అయ్యి నెల దాటినా అధికారుల చర్యలు నిల్
- తహశీల్దార్ లేఖ రాసినా పట్టించుకోని ఎఫ్‌డిఒ
- అప్పట్లో మత్స్యశాఖ అడ్డగోలు అనుమతులు, నేడు వెనుకంజ
- విచారణలో తప్పు తేలినా కొనసాగుతున్న ఎఫ్‌డిఒ
- ఎఫ్‌డిఓపై చర్యలపై మత్స్యశాఖ అధికారులు మౌనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం అడవికొలను గ్రామం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలో 148 నుంచి 163 సర్వే నెంబర్లలో దాదాపు 70 ఎకరాల చేపల చెరువు ఉంది. ఈ చేపల చెరువులో సర్వే నెంబర్ 159-4లో పంట బోదెకు సంబంధించి 94 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అప్పట్లో ఏమాత్రమూ పరిశీలించకుండా ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ మత్స్యశాఖ అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వ భూమి కలుపుకుని తవ్విన చేపల చెరువుపై ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి 94 సెంట్ల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేల్చారు. ప్రభుత్వ భూమికి సంబంధించి హద్దులు నిర్ణయించి బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. చెరువులో చేపలు సాగు సాగుతుండడంతో తమకు 50 రోజులు గడువు కావాలని సాగుదారులు జిల్లా మత్స్యశాఖ అధికారిని కోరారు. సాగుదారులు కోరినట్లుగా అధికారులు సమయం ఇచ్చారు. గడిచిన జులై 30వ తేదీతో గడువు సైతం ముగిసింది. సాగుదారులు చేపలు పట్టుకుని చెరువు ఖాళీ చేశారు. చెరువు ఖాళీ అయ్యిందని ప్రభుత్వ భూమిని వేరుచేయడానికి చర్యలు తీసుకోవాలంటూ గత నెల ఆగస్టు 15వ తేదీన తహశీల్దార్ జిల్లా మత్స్యశాఖ అధికారులకు లేఖ రూపంలో తెలిపారు. ఇతర శాఖల సమన్వయంతో మండల కమిటీ ముందుకు సాగాలంటూ ఎట్టకేలకు జిల్లా మత్స్యశాఖ అధికారి నిడమర్రు మండల తహశీల్దార్‌కు తిరిగి లేఖ ద్వారా తెలిపారు. తహశీల్దార్ వెంటనే స్పందించారు. అందుకు సంబంధించి యంత్రాలను ఏర్పాటు చేస్తే పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటుతోపాటు, రెవెన్యూ అధికారులను పంపిస్తామని మండల కమిటీ కన్వీనర్ అయిన మండల మత్స్యశాఖ అధికారి (ఎఫ్‌డిఓ)కి లేఖ ద్వారా తెలిపారు. ఇది జరిగి 20 రోజులకుపైగా గడిచిపోయింది. ఎఫ్‌డిఓ నుంచి ఎటువంటి స్పందనా లేదు. దీంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎఫ్‌డిఒ అదిగో.. ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎఫ్‌డిఒ ఉద్దేశపూర్వకంగానే తాత్సరం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు కలిసి ప్రభుత్వ భూమిని కాపాడాల్సి ఉండగా ఎవరికి వారు తమకు పట్టనట్లు వ్యవహరించడం వెనుక కారణాలు ఏమిటో తెలియని పరిస్థితి. ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అప్పట్లో అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేసిన మత్స్యశాఖ అధికారులు వాస్తవం తేలిన తర్వాత సైతం చెరువు అనుమతులు రద్దు చేయకపోవడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

తప్పు చేసినట్లు తేలిన అధికారే కొనసాగింపు

నిడమర్రు మండలంలోని మత్స్యశాఖ అధికారిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడంతో మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విచారణకు ఆదేశించారు. కైకలూరు మత్స్యశాఖ ఎడి రాజ్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆయన విచారణలో నిడమర్రు మండల ఎఫ్‌డిఒ అధికార దుర్వినియోగానికి పాల్పడి తప్పు చేసినట్లు నిర్ధారించారు. విచారణ నివేదికను మే 24న జిల్లా మత్స్యశాఖ అధికారికి అందజేశారు. మత్స్యశాఖ అధికారి ఆ శాఖ కమిషనర్‌కు పంపించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. ఆ లేఖలో అధికార దుర్వినియోగానికి పాల్పడంతోపాటు, మత్స్యశాఖ ప్రతిష్ట దెబ్బతీసినట్లు పైఅధికారులకు తెలిపారు. విచారణ నివేదిక అంది నెలలు గడిచినా ఇప్పటి వరకూ మత్సశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. తప్పు చేసినట్లు తేలిన అధికారే ఇప్పటికీ అక్కడ విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఇప్పుడు అదే అధికారి అక్రమ చేపల చెరువుపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం వహిస్తున్న పరిస్థితి నెలకొంది. తప్పు చేసినట్లు తేలిన అధికారిపై ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదో మత్స్యశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

మండల కమిటీదే బాధ్యత..

బి.నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్న చేపల చెరువును ఖాళీ చేశారు. ఇదే విషయంలో మండల కమిటీ ఛైర్మన్ తహశీల్దార్‌కు లేఖ రూపంలో తెలిపాం. మిగిలిన శాఖలు సమన్వయంతో ఆ చెరువుపై మండల కమిటీ చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లా మత్స్యశాఖకు సంబంధం లేదు. చెరువు ఖాళీ చేసి అప్పగించే బాధ్యతను జిల్లా మత్స్యశాఖ పూర్తి చేసింది.

కర్నూలు ఉల్లి వినియోగించేలా ఏర్పాట్లు చేయాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


ఉల్లిపాయలను పరిశీలిస్తున్న జెసి

కర్నూలు ఉల్లినే వినియోగించేలా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక బ్రహ్మానంద రెడ్డి హోల్ సేల్ ఉల్లి మార్కెట్‌ను జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. కడప, కర్నూల్ నుంచి వచ్చిన ఉల్లిపాయలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఉల్లి ధర తక్కువ పలకడంతో హోల్ సేల్ వ్యాపారులతో జెసి మాట్లాడారు. కర్నూల్, కడప నుంచి వచ్చిన ఉల్లి కొనడం వల్ల రైతులు ఆదుకున్నట్లు అవుతుందన్నారు. మార్కెట్లో కొనుగోళ్లు పెరిగితే రైతులకు కొంత ఊరట లభిస్తుందన్నారు. ఇక్కడ వచ్చే రేటు కంటే ఎక్కువ రేటు వచ్చే విధంగా మార్కెట్ యార్డులు, రైతు బజార్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని, హోల్ సేల్ వ్యాపారులు రైతుకు కనీసం మద్దతు ధర వచ్చేలా సహకరించాలని సూచించారు.

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులను జెసి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఆర్‌డిఒ కార్యాలయం ఛాంబర్ వద్ద ఖరీఫ్ సీజన్ 2025 - 26 సంబంధించి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం సేకరణపై సమీక్షించారు. జెసి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ త్వరితగతిన చేయాలన్నిరు. ఇప్పటివరకూ మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి కోతలు జరిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని కడియద్దంలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, సహకార శాఖ ఎంఎల్‌ఒలు పాల్గొన్నారు.

22న చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - ఆచంట

వాస్తవ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. నూతన కౌలు చట్టం తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు వెంటనే కౌలు రైతులకు జమ చేయాలని కోరుతూ ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడ నుంచి చలో అసెంబ్లీ ర్యాలీని జయప్రదం చేయాలని గోపాలన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తామని అసెంబ్లీలో వ్యవసాయ శాఖా మంత్రి ప్రకటించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కౌలు రైతుల సంఘం నాయకులతో చర్చించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఈ ప్రభుత్వానికి కూడా గత ప్రభుత్వం మాదిరిగానే కౌలు రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి కౌలు రైతులందరూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోపాలన్ పిలుపునిచ్చారు.

అక్టోబర్ నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

- ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యం
- 265 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- రూ.కోటీ 9 లక్షల గోనె సంచులు అవసరం
- 25 నుంచి సిబ్బందికి అవగాహన

జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మహ్మద్ ఇబ్రహీం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అక్టోబర్ మొదటి వారంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మహ్మద్ ఇబ్రహీం తెలిపారు. ఇటీవల ధాన్యం కొనుగోలుకు సంబంధించి కాకినాడలో సమావేశంలో ప్రభుత్వం అధికారులకు ఇచ్చిన ఆదేశాలు ఏమిటి? జిల్లాకు సంబంధించి ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు లక్ష్యం ఎంత, గడిచిన రబీలో కొనుగోలు చేసిన ధాన్యం, సొమ్ములు ఎంత చెల్లించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో గోనె సంచులు ఎంత మేర అవసరం. సిద్ధంగా ఉన్నాయా, రవాణా ఏర్పాటు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు వంటి పలు విషయాలను పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మహ్మద్ ఇబ్రహీంతో 'ప్రజాశక్తి' జరిపిన ముఖాముఖిలో వివరించారు.

ప్రశ్న: ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడి ఎంత వస్తుందని అంచనా వేశారు? ఎంత ధాన్యం కొనుగోలు లక్ష్యంగా తీసుకున్నారు?

డిఎం : జిల్లాలో 2.05 లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. మొత్తం 6.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా తీసుకున్నాం.

ప్రశ్న : గడిచిన రబీలో జిల్లాలో ఎంతమేర ధాన్యం కొనుగోలు చేశారు. ఎన్ని రూ.కోట్ల సొమ్ము రైతులకు చెల్లించారు?

డిఎం : రబీలో అత్యధికంగా 7.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రూ.1,600 కోట్లకు పైగా సొమ్ము రైతులకు చెల్లింపులు జరిగాయి. 48 గంటల్లోనే ధాన్యం సొమ్ములు చెల్లింపులు చేయడంతో రైతులకు ఎంతగానో మేలు జరిగింది.

ప్రశ్న : ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు? ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు?

డిఎం : అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం 265 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : కాకినాడ సమావేశంలో ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు జారీ చేసింది?

డిఎం : ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడడంపైనా, ఉభయగోదావరి జిల్లాలో 20 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్న లక్ష్యంగా ఇచ్చాం.

ప్రశ్న : ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఎన్ని గోనె సంచులు అవసరం కానున్నాయి?

డిఎం : రూ.కోటీ తొమ్మిది లక్షల గోనె సంచులు అవసరం. అందుకు సంబంధించి ఏర్పాట్లు జరిగాయి.

ప్రశ్న : రవాణా, తేమ శాతం ఇబ్బందులు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎం : రవాణాకు సంబంధించి రైతులు స్వయంగా ధాన్యం తరలిస్తే కిరాయి సొమ్ములు వారికే ఇస్తాం. బయట వాహనాలతో తరలిస్తే నిర్ధేశించిన ప్రకారం కిరాయి సొమ్ములు చెల్లించడం జరుగుతోంది. తేమ శాతంలో ఇబ్బందులు రాకుండా ఇంతకు ముందుమాదిరిగానే చర్యలు తీసుకోవడం జరుగుతోంది.

ప్రశ్న : ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహనా కార్యక్రమాలు ఏమైనా నిర్వహిస్తున్నారా?

డిఎం : ధాన్యం కొనుగోలుకు సంబంధించి గ్రామాల్లోని వ్యవసాయ అధికారులకు, సహకార సంఘాల్లోని సిబ్బందికి ఈ నెల 25 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

17న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

డిఎంఅండ్‌హెచ్‌ఒ గీతాబాయి

ప్రజాశక్తి - భీమవరం

మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించే లక్ష్యంతో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను దేశవ్యాప్తంగా ఈనెల 17న ప్రారంభించనున్నారని డిఎంహెచ్‌ఒ గీతాబాయి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 471 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో ప్రత్యేకంగా మహిళలకు, పిల్లలకు విస్తృత వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రసూతి, కంటి పరీక్షలు, ఇఎన్‌టి, దంత, చర్మవ్యాధి, మధుమేహం, రక్తపోటు, కేన్సర్లు, టిబి, ఎనీమియా, సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, పోషణ సలహాలు, రక్తదాన కార్యక్రమాలు, పౌష్టికాహార అవగాహన, వయో వందన కార్డులు నమోదు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ కెఎంఆర్.కిషోర్ మాట్లాడుతూ దీని ఉద్దేశం దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లల ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడమే అని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆరోగ్యవంతమైన కుటుంబాలు శక్తివంతమైన సమాజాలు నిర్మించాలని లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

సాగరతీరం కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కెపి.పాలెంసౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

మొగల్తూరు-వెంప రహదారి నిర్మించాలి

కొనసాగిన రిలే దీక్ష

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు-వెంప రహదారి నిర్మించాలని ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం ఆరవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో ఎడ్ల చిట్టిబాబు, బంగారు వెంకట సీతారామయ్య, అడ్డాల ఏడుకొండలు, కుందేటి వెంకటేశ్వరరావు, వాముశెట్టి బోసు బాబు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో ఐక్యవేదిక సభ్యులు

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆరోగ్యమే మహా భాగ్యమని, మన ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం మెంటే వారి తోటలో వండర్ కిడ్స్ స్కూల్ వద్ద ఆదివారం వినాయక హాస్పిటల్, వండర్ కిడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్ఎ సూచించారు. నేటి సమాజానికి దాతల సహకారం ఎంతో అవసరమని, ఇటువంటి ఉచిత మెగా వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, 10 మంది అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ అన్నారు. వండర్ కిడ్స్ స్కూల్ ఛైర్మన్ అల్లు రామకృష్ణ, వినాయక హాస్పిటల్ డాక్టర్ సివిఆర్ గజపతి రాజు మాట్లాడుతూ అన్ని వయసుల వారికి అన్ని వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్యాస్, పేగు, బిపి, షుగర్, థైరాయిడ్, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధి, ఎముకలు, స్త్రీల సమస్యలు, ఊపిరితిత్తులు, కిడ్నీ, అన్ని సాధారణ వ్యాధులు, కంటి పరీక్షలు, ఉచితంగా కళ్లజోళ్లు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, తహశీల్దార్ రావి రాంబాబు, డాక్టర్లు, మెంటే వారి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో హిందీ భాష అగ్రస్థానం : ఎంఎల్ఎ

భీమవరం టౌన్ : హిందీ భాష నేర్చుకుంటే దేశ నలుమూలలా తిరగవచ్చునని, ప్రపంచ దేశాల్లో కూడా హిందీ భాషనే ప్రముఖంగా ఉందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యాన ప్రభుత్వ, ప్రయివేట్ హైస్కూల్‌లోని 24 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ దేవనాగరి లిపిలో రాయబడిన హిందీ భాషను రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రెండు అధికారిక భాషలలో హిందీ ఒకటి అని, రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించబడతాయని, హిందీని నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలు మొదటి భాషగా మాట్లాడుతున్నారన్నారు. గత 26 ఏళ్లుగా హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు రంగ సాయిని అభినందించారు. కార్యక్రమంలో పొత్తూరి బాపిరాజు, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, టివివి.ప్రసాద్ పాల్గొన్నారు.

డప్పు కళాకారుడు రాఘవులు మృతి

ప్రజాశక్తి - ఆచంట


భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న నేతలు



సిపిఎం నాయకులు, ప్రజానాట్యమండలి డప్పు కళాకారుడు చిన్న మల్లం గ్రామానికి చెందిన కొండేటి రాఘవులు(60) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మిక మృతిచెందారు. ఈయనకు భార్య వీరమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు. ఈయన కుమారుడు గతంలో అనారోగ్యంతో మృతిచెందారు. రాఘవులు సిపిఎం సభ్యులుగాను, 2005వ సంవత్సరం నుంచి ప్రజానాట్యమండలి డప్పు కళాకారుడుగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం ఆచంట మండలం పెనుమంచిలి గ్రామ శాఖ సభ్యులుగా కొనసాగుతున్నారు. రాఘవులు అకాల మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సూర్నేడి వెంకటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి పరువు మోహన్ రావు, మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లబ్బాయి, సిర్రా నరసింహమూర్తి, సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు, నాయకులు సిర్రా విఘ్నేశ్వరుడు, మానుకొండ వీర్రాజు, వర్ధనపు శ్రీరాములు, కొండేటి సత్యనారాయణ, గెద్దాడ వెంకట్రావు, ఖండవల్లి బాబురావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.వల్లి తదితరులు ఆయన భౌతికకాయంపై సిపిఎం జెండా కప్పి పూలమాలతో ఘనంగా జోహార్లు అర్పించారు. రాఘవులు అకాల మృతి పార్టీకి, ప్రజానాట్యమండలికి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తంచేశారు. రాఘవులు మృతి పట్ల జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

కార్మిక, కర్షకుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి

ప్రథమ వర్ధంతి సభలో వక్తలు

తాడేపల్లిగూడెం : కమ్యూనిస్టు పార్టీ ముద్దుబిడ్డ, కార్మిక కర్షకుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి సత్తి కోదండరామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ సభను ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పుల్లారెడ్డి, తేతలి నాగిరెడ్డి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ప్రాంతంలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సీతారాం ఏచూరి ఉన్నత చదువులు చదివారని, అలాగే ఏచూరి కుటుంబం మొత్తం ఐఎఎస్, ఐపిఎస్ ఆఫీసర్‌లేనన్నారు. ఏచూరి కూడా ఢిల్లీ యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించారని, అంత ఉన్నతమైన చదువులు చదువుకుని, కమ్యూనిస్టు పార్టీలో పేద బడుగు బలహీన వర్గాల సమస్యలను తెలుసుకుని పనిచేయడానికి వచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఏచూరి అనేక కమ్యూనిస్టు దేశాలు తిరిగి, ఆ దేశాలలో ఉన్న కమ్యూనిస్టు భావాలను అర్థం చేసుకొని, ఈ దేశంలో కూడా సోషలిస్టు సమాజం ఏర్పడాలని తపన పడేవారన్నారు. బిజెపి ప్రభుత్వం మతోన్మాదం పేరుతో ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చులు పెడుతూ ఈ దేశ రాజ్యాంగాన్ని, ఈ దేశ లౌకిక విధానాన్ని, సార్వభౌమత్వాన్ని నాశనం చేసే విధంగా ఉందని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి, ఈ దేశంలో ఉన్న వామపక్ష పార్టీలను, లౌకిక శక్తులను ఏకం చేసి ఇండియా కూటమిగా ఏర్పరిచారని, 2024 ఎన్నికలలో బిజెపిని, దాన్ని బలాన్ని తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషించింది సీతారాం ఏచూరి అని వారు తెలిపారు. ఈ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడంలో ఆయన తీసుకున్న చొరవ ప్రధానమైనదని, ఈ దేశంలో ఉన్న ప్రజానీకం ముఖ్యంగా యువత ఆయన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అర్పించడం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రిసాయి రెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, అడప ఆంజనేయులు, మద్దాల పుత్రయ్య, రెడ్డి ఆకుల నారాయణ, బుద్దాల నాని, గాది వెంకట్రావు, సత్తి దుర్గారెడ్డి, గుడిమెట్ల నాగబాబు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటరాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా వెంకట రాయుడు పుట్టినరోజు

భీమవరం టౌన్ : వైసిపి నియోజవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాయలంలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగాయి. నియోజవర్గంలో పట్టణంతో పాటు భీమవరం, వీరవాసం మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి విచ్చేశారు. పట్టణ వైసిపి అధ్యక్షులు గాదిరాజు రామరాజు, జిల్లా మహిళా అధ్యక్షులు కోడె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ కేకును ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి, యుగంధర్, గూడూరు ఉమాబాల, పీర్చేర్ల సత్యనారాయణ రాజు, వీరవాసరం మండల నాయకులు నాగరాజు శ్రీనివాసరాజుతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జ్వర బాధితులకు పరామర్శ

పాలకొల్లు రూరల్: సగం చెరువు గ్రామంలో ఇటీవల కాలంలో చాలా మంది విష జ్వరాల బారిన పడి అనారోగ్యానికి గురయ్యారు. రక్తహీనత, డెంగీ జ్వరాలు, టైఫాయిడ్ తదితర జ్వరాలతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొంతమంది ఇప్పటికీ పలు ఆసుపత్రులలో చికిత్స తీసుకొని ఇంటి వద్ద ఉపశమనం పొందుతున్నారు. వారిని పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) పరామర్శించారు. పరామర్శించిన వారిలో మోసుగంటి మౌంట్ రిచర్డ్, కనపాల ఇస్సాక్, కట్టా స్వర్ణ కుమారి, కోళ్ల జీవేశ్వర రావు, సానబోయిన మధు ఉన్నారు.

టిడిపి మండల అధ్యక్షులుగా రుద్రరాజు రమేష్ రాజు

పోడూరు: పోడూరు మండల టిడిపి నూతన అధ్యక్షులుగా పోడూరు గ్రామానికి చెందిన రుద్రరాజు రమేష్ రాజు నియమిస్తున్నట్లు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ప్రకటించారు. మండలంలోని కొమ్ముచిక్కాలలోని తన కార్యాలయంలో జరిగిన పోడూరు టిడిపి ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన ప్రకటించారు.

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్ : దేవాలయ నూతన పాలకవర్గ సభ్యులు భక్తులకు మెరుగైన సేవలను అందించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్‌గా గనిరెడ్డి త్రినాథ్, సభ్యులుగా పి.కార్తీక్, సిహెచ్.నాగలక్ష్మి, ఎస్.గంగాధర్ రావు, ఎ.హైమవతి, ఎం.శ్రీనివాసరావు, ఎం.రఘుబాబు, బి.లక్ష్మీ, కె.వీర వెంకట రామశాస్త్రిలచే ఆలయ ఇఒ తోట శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

మిత్ర హాస్పటల్‌లో సిపిఆర్‌పై శిక్షణ

కాళ్ల: ఇటీవల కాలంలో హార్ట్ ఎటాక్, కార్డియాలజీ అరెస్టులు ఎక్కువగా జరుగుతున్నాయని, వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు సంభవించి అనేకమంది ప్రాణాలను కోల్పోతున్నారని హాస్పిటల్ అధినేత డాక్టర్ విక్రాంత్ అన్నారు. పెదఅమిరంలో ఉన్న మిత్ర హాస్పిటల్లో ఆదివారం ఆసుపత్రి ఆధ్వర్యంలో సిపిఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఆర్ ఏవిధంగా చేయాలి అనే దానిపై స్వయంగా చేసి చూపించారు. లయన్స్ అధ్యక్షులు బొండా రాంబాబు, కోశాధికారి కనగర్ల రామకృష్ణ, గోపిశెట్టి మురళీ, శిరీష, మహ్మద్ సరోజిని, పాశం సుభద్రదేవి, డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, ప్రియాంక పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదువు మా కిష్టం

తాడేపల్లిగూడెం : పట్టణ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువు మా కిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ సత్య ప్రకాష్ పుస్తక సమీక్ష, రచయితల పరిచయం గురించి విపులంగా వివరించారు. ఆదిత్య స్కూల్ విద్యార్థులు పాల్గొని గ్రంథాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గరికపాటి బాపయ్య శర్మ, ఎ.జనార్ధన్ రావు, ప్రత్తి వీరాస్వామి, జాన్ జాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు చదువుకోవాలని తెలిపారు. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

తుంగపాటి చెరువుగట్టు స్థల పరిశీలన

నరసాపురం : నరసాపురం పట్టణం 28వ వార్డులో మున్సిపాలిటీకి చెందిన తుంగపాటి చెరువుగట్టు స్థలాన్ని ఆదివారం డంపింగ్ యార్డ్ కోసం ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ స్థానిక ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పర్యావరణహితంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ శుభ్రతకు ఇది తోడ్పడేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కూడా నాయకర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యను ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఒసి అందజేత

నరసాపురం : మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన తుళ్లూరి గిరిధర్ రావు, ఇద్దరు కవల పిల్లలు కోమల్ వెంకట్, కోమల్ విరాట్ ఆనంద్ వినికిడి లోపంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం రూ.18,54,500 వ్యయం అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ వెంటనే స్పందించి సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎల్‌ఒసి లెటర్ అందజేశారు. తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ పిల్లలకు త్వరలోనే మంచి జరుగుతుందని భరోసా కల్పించారు. మండలంలోని తూర్పుతాళ్లుకు చెందిన సిహెచ్.రామకృష్ణ రూ.2 లక్షల ఎల్‌ఒసి లెటర్‌ను కూడా జనసేన కార్యాలయంలో అందజేశారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్, ఆర్థో డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి 8 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. కందా వెంకటప్రభాకరం ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

క్షణం క్షణం.. భయం భయం

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పంటుపై ప్రయాణం

నరసాపురం : ప్రభుత్వానికి ఆదాయం ఎంత వచ్చిందని లెక్కలేసుకోవడమే తప్ప ప్రజల ప్రాణాల గురించి పట్టించుకునే ధ్యాస అధికారులకు, ప్రజాప్రతినిధులకు లేదు. పంటి నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది పట్టించుకోవడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా నరసాపురం-సఖినేటిపల్లి మధ్య గోదావరిలో నడిచే పంటు అదుపుతప్పి ప్రమాదానికి గురైందని స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం జరిగినట్లుగా సమాచారం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధిక లోడు కారణంగానే గోదావరిలో పంటు అదుపు తప్పినట్లు తెలుస్తోంది. పంటు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి దానిని ఒడ్డుకు చేర్చడంతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. గోదావరిలో పంటి ప్రయాణం భద్రత లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

జాతీయస్థాయి శిక్షణకు స్వామి మాస్టారు ఎంపిక

కాళ్ల : మండలంలోని మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలి ఉపాధ్యాయులు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైనట్లు కాళ్ల మండల విద్యాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. సిఐఇటి-ఎన్‌సిఇఆర్‌టి న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్(ఎస్ఆర్‌జి)గా ఎంపిక చేసి వారికి రెండు బ్యాచ్లలో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా మొదటి ఫేజ్ లో ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు 5 రోజులపాటు ఆన్‌లైన్ శిక్షణలో ఎపి నుండి 20 మంది ఎస్ఆర్‌జిలలో ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా స్వామి మాస్టార్ మాట్లాడుతూ ఇంతకుముందు ఈ-కంటెంట్ రూపకల్పనలో భాగంగా మూడవ తరగతి గణితమునకు సంబంధించి రూపొందించిన వీడియోలు ఎపి ఈ-పాఠశాల ఆప్, ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో పొందుపరచడం జరిగిందని స్వామి మాస్టారు పేర్కొన్నారు. ఈ శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకొని చక్కని ఈ కంటెంట్ రూపకల్పనకు కృషి చేస్తానన్నారు. స్వామి మాస్టారును ఎంఇఒ-2 పి.ఏసుదాసు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సిఆర్‌ఎంటి నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

భీమవరం : సిఆర్‌ఎంటిలుగా విద్యావ్యవస్థలో ఎన్నో కీలక బాధ్యతలు తీసుకొని విద్యాభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. శ్రీపొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల భీమవరంలో జిల్లా పాఠశాలల క్లస్టరు, కాంప్లెక్స్ సిఆర్‌ఎంటిల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎన్.నరేష్, ట్రెజరర్‌గా ఎస్.నాగార్జున, ఉపాధ్యక్షులుగా ఎ.రవీంద్ర, కన్వీనర్‌గా డి.మదన్, జనరల్ సెక్రటరీగా టివిఎస్‌కె.నేతాజీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాల పెరుగుదల, ఉద్యోగభద్రత, ఇహెచ్‌ఎస్ సదుపాయం లేదన్నారు. ఉద్యోగవిరమణ కాలాన్ని 62 సంవత్సరాలకు పెంచి ఉద్యోగభద్రత కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎవి.రమణ, కృపారావు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో క్రీడాకారుల ఎంపికలు

వీరవాసరం : అండర్-14, అండర్-17 బాలబాలికల రైఫిల్ షూటింగ్ ఎంపికలు ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 16వ తేదీన శ్రీచింతలపాటి బాపిరాజు మున్సిపల్ హైస్కూల్ భీమవరంలో, ఆర్చరీ ఎంపికలు 17వ తేదీన వోల్గాస్ అకాడమీ, వంశీకృష్ణ నగర్ భీమవరంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఈ నెంబర్లను 91002 85197, 7013865335 సంప్రదించవలెనని తెలియజేశారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఫరూక్

ఆకివీడు : మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా మహమ్మద్ ఫరూక్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మండల తహశీల్దార్‌గా పనిచేసిన నండూరి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టరేట్ కు బదిలీ కాగా ఇప్పటి వరకు ఉపతహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఎండి ఫరూక్ అదనపు బాధ్యతలు స్వీకరించినట్లు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

ఉండి: మ్యాక్సి విజన్ సౌజన్యంతో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సాయిరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉండి నిమ్మల పేటలో మ్యాక్సి విజన్ కంటి ఆస్పత్రి సహకారంతో రోగులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఆపరేషన్ చేయిస్తారని తెలిపారు.

ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం

నరసాపురం: శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ వెన్నా బాబురావు అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరంలో వేంచేసియున్న ప్రసిద్ధ శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా వెన్నా బాబురావు, కమిటీ సభ్యులుగా పుచ్చకాయల తిరుపతమ్మ, చెల్లబోయిన కనకదుర్గ, కొప్పర్తి ముత్యాలరావు, తెలగంశెట్టి సూర్యనారాయణ, ఈవన కొండలరావు, పులిపాక రామహరిత, ఎక్స్‌ఆఫీషియో సభ్యునిగా యలమంచిలి ప్రసాద్ శర్మచే ఆలయ ఇఒ ఆర్. రామచంద్రకుమార్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు.

డిఎలు విడుదల చేయాలి

భీమవరం టౌన్ : పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సిపిఎస్‌ని రద్దు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సంఘం నాయకులు ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులుకి వినతి అందజేశారు. జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, మండల అధ్యక్షులు ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

ఉండి: ఇటీవల బదిలీపై వెళ్లిన ఉండి గ్రామ వ్యవసాయ సహాయకులు ఆల్ఫ్రెడ్, స్వప్న ప్రియలను ఉండి గ్రామానికి చెందిన రైతులు ఘనంగా సత్కరించారు. ఆదివారం ఉండి మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ప్రభుత్వం నుంచి రైతులకు రావాల్సిన అన్ని సేవలను రైతులకు అందించి వారి అభివృద్ధికి సహకరించిన ఆల్ఫ్రెడ్, స్వప్నప్రియలను రైతులు సత్కరించడం అభినందనీయమని అన్నారు. రైతులు పోలుబోతు రాము, కొమ్మన బాబి, అప్పాజీ పాల్గొన్నారు.

విఆర్‌ఒలపై ఒత్తిడి తగ్గించాలి

